# వెంటాడే నీడ

"ఆ చేత్తోనే రెండు క్రొత్త అంగవస్త్రాలు కూడా వ్రాయండి!"

దొడ్లో నవ్వారు మంచం వాల్చి, దానిమీద వేసిన పాత పంచెమీద పెళ్ళి వడియాలు పెట్టుతున్న సీతారత్నం అంది.

ఒకప్రక్క అలా వడియాలు పెట్టుతూ, మరోప్రక్క మా అమ్మాయి పెళ్ళికి తీసుకురావాల్సిన సరుకులు ఒక్కొక్కటే గుర్తుకు తెచ్చుకుంటూ నాకు చెప్పుతోంది. వసారా అరుగుమీద కూర్చొని నేను సరుకులు పట్టీ వ్రాసుకుంటున్నాను.

'అంగవస్త్రాలు' అన్నమాట చెవిన పడగానే లిస్టు రాస్తోన్న నా చెయ్యి ఠక్కున ఆగిపోయింది. నా మనస్సెక్కడికో పోయింది, దాన్తోపాటు నా ఆలోచనలూ ఎటో పోయాయి.

నేను 'ఊ... ఆ...' అని అనకపోవడం చూచి మా ఆవిడ తలెత్తి నావంక చూసింది.

"ఆపేశారేంటి, రెండు క్రొత్త అంగవస్త్రాలు కూడా లిస్టులో రాయండి!" అంది.

నేను ఎటో చూస్తూ, ఏదో ఆలోచిస్తూ మౌనంగా వుండిపోయాను.

మళ్ళీ, "పెళ్ళిలో క్రొత్త అంగవస్త్రాలతో ఎంతో పని ఉంటుంది. అప్పటికప్పుడు కావాలంటే అప్పుడు బజారుకు పరిగెత్తుతారా? మీదంతా పిసినారితనం. అంగవస్త్రాలు ఖరీదు ఎంతో ఉండదు. వ్రాయండి!" అంది - చేతిపిండి మొగానికి అంటకుండా ముంజేతితో మొగానికి పట్టిన చెమటను సుతారంగా తుడ్చుకుంటూ.

నా మౌనం, ఖర్చుకు వెనకాడే నా పిసినారితనంగా ఆమెకు అనిపించి ఉంటుంది.

ఇది నా పిసినారితనం కాదు - ఇదినా గుండెల్లో గూడుకట్టుకున్న బాధని, ఇది నా గతంలోని వ్యధనీ ఆమెకెలా తెలుస్తుంది!

చేస్తోన్న పనిని ఒక్కక్షణం ఆపి, నా మొగం లోకి పరిశీలనగా చూచి వుంటే - అంగవస్త్రాల పేరు వినగానే నా మొగంలో నల్లటి నీడొకటి సన్నగా తారట్లాడడం చూచి వుండేది! ఇంకాస్త పరీక్షగా నా కళ్ళల్లోకి చూచి వుంటే - నా గుండె లోతుల్లోంచి ఒక విషాద వీచిక బలంగా, ఉవ్వెత్తుగా లేచిన చిహ్నాలు కూడా చూచి వుండేది!

అంగవస్త్రాలకే ఇంత ఇదా అని మీకనిపించవచ్చు. చూచేవాళ్ళకవి మామూలు అంగవస్త్రాలే! కాని, నాకవి ఏదో దుష్టశక్తి నామీదకు ఎక్కుపెట్టిన నాగాస్త్రాలు! పగబట్టిన విధి నాపైకి విసిరిన శాపపు వలలు అని!

వీటితో నా జీవితానికెలాంటి సంబంధం వుందో, అవి నా జీవితాకాశంలో ఎలాటి విషాద కారుమేఘాలను రేపాయో మీకు చెప్పాలంటే దాదాపు నలభై అయిదు సంవత్సరాలు వెనక్కి పోవాలి! మీకు ఒక కుర్రవాడి బాల్యం గురించి చెప్పాలి! పాలుకారే పసి బుగ్గలతో అమాయకంగా ఉంటూ, చురుకైన చిన్న కళ్ళతో ప్రతిదాన్నీ నిశితంగా చూస్తూ చూచిన ప్రతిదాన్నీ తన పసిమనస్సుకి తీసికొనే ఎనిమిదేళ్ళ ఒక పిల్లవాడ్ని గురించి చెప్పాలి!

ఆ పిల్లవాడి పేరు రాము. రాము ఎర్రగా బక్కపల్చగా ఉంటాడు. కాళ్ళు బారుమూలంగా ఎత్తుగా కనిపిస్తాడు. సుకుమారమైన శరీరం, సుతిమెత్తని మనస్సు. అతని మనస్సులో ఆటోమేటిక్ కెమెరాలూ, పవర్‌ఫుల్ ఎక్స్‌రే ఫిల్ములూ ఉన్నాయి! మనస్సును స్పందించే ప్రతి దృశ్యమూ ప్రతి చిన్న సంఘటనా అతని మనస్సులో గాఢంగా ముద్రపడిపోతుంది.

ఆరోజు రాము వాళ్ళ పెరట్లో తన స్నేహితులతో కలిసి బాదంచెట్టు క్రింద బచ్చాలాట ఆడుకుంటున్నాడు.

అప్పుడు ఎండ ఎర్రగా ఉన్నా బాదం చెట్టు క్రింద చల్లగా వుంది. నేలమీద బాదం ఆకుల నీడలు గమ్మత్తుగా కదులుతున్నాయి. బాదం చెట్టు మీది గూటిలోని పిల్లకాకి బుజ్జి కడుపులో బుజ్జి ఆకలి కరకరమంటూంది.

రాము అమ్మ అప్పటికే రెండు మూడుసార్లు కేకేసింది. ఆట యావలో పడి రాము వినిపించుకోలేదు. చివరికి ఆమే పంచలోకి వచ్చి "రామూ, నిన్నే పిలుస్తుంటా! ఇకీ పూటకు ఆటలాపేసి లోపలికి రా" అంది గట్టిగా.

తల్లి గొంతులోని కోపాన్ని పసిగట్టిన రాము స్నేహితులతో, 'ఇక చాలురా!' అన్నాడు. వాళ్ళు ఎవరిదారి వాళ్ళు పోయారు. ఖాళీ సిగరెట్టు పెట్టె డొక్కుల్ని లెక్కపెట్టుకుంటూ తల్లి దగ్గరకెళ్ళాడు.

"ఆ వెధవ సంత అక్కడ పడేసి వెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కురా!" అంది.

"అన్నం పెడతావా?" అని అడిగేడు.

వస్తోన్న నిట్టూర్పును ఆపుకుంటూ "అన్నం కాలేదు. నీతో వేరే పనుంది. ముందు గాబు దగ్గరకెళ్ళి కాళ్ళూ చేతులూ శుభ్రంగా కడుక్కుని దండెం మీద ఆరేసిన ఆ అంగవస్త్రం కట్టుకొని రా!" అంది.

"ఇప్పుడు అంగవస్త్రం ఎందుకమ్మా?" అమాయకంగా అడుగుతూ, అప్పుడు తలెత్తి తల్లివంక చూశాడు.

ఆమె పంచలో గోడకు జారగిలబడి కూర్చొని వుంది. ఎందుకో తల్లి మొగం బోలెడు దిగులుగా వుంది. కళ్ళల్లో విషాదచ్ఛాయలు కనిపిస్తోన్నాయి. రోగం వచ్చిన తల్లికోడిలాగా ముసగదీసుకుని కూర్చుంది. ఎక్కడా చిన్న గడ్డిపరక కూడా దొరకని గోమాత లాగా దీనంగా వుంది.

తల్లి ఎందుకంత దిగులుగా, దీనంగా వుందో రాము చిన్న మనస్సుకు, ఆ కొద్ది వయస్సుకు కొంచెం కొంచెం చూచాయగా అర్థమౌతోంది.

అమ్మ ఎప్పుడిలా ఎండిపోయిన తులసి మొక్కలాగా వుంటుందో.... ఎప్పుడు తనని ఆరేసిన

అంగవస్త్రం కట్టుకోమంటుందో రాముకు తెల్సు! అంటే, ఆ రోజు ఇంకా పొయ్యిలోని పిల్లి లేవలేదన్నమాట! ఆ పూటకు ఇంట్లో బియ్యం నిండుకున్నాయి అన్నమాట. ఎక్కడా చారెడు బియ్యం కూడా అప్పుపుట్టని అధ్వాన్నపు స్థితన్నమాట! ఆ రోజు ప్రొద్దుట తండ్రి నశ్యం కొనుక్కోటానికి ఎక్కడన్నా అణా, అర్ధణా దొరుకుతుందేమోనని ఇంట్లో, గూళ్ళల్లో, డబ్బాల్లో వెతుక్కున్నాడన్నమాట! ఎక్కడా ఏమీ దొరక్క, తనలో తాను గొణుక్కుంటూ మురికి చేతిసంచి తీసికొని బయటికి వెళ్ళిపోయి వుంటాడన్నమాట! మళ్ళీ మధ్యాహ్నం ఏ మూడింటికో ఖాళీ సంచితో, నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి తిరిగి వచ్చి కుక్కిమంచం మీద సోలిపోతాడన్నమాట! అప్పుడు అమ్మ, "భోజనం వడ్డిస్తా, కాళ్ళు కడుక్కోండి!" అని అనాలన్నమాట! అప్పుడు జారిపోతున్న కళ్ళజోడు సందులోంచి చూసే నాన్నకు, అమ్మలో వాళ్ళ 'అమ్మ' కనిపించాలన్నమాట!

"అంగవస్త్రం కట్టుకురారా అంటే అలా చూస్తూ నిలబడిపోయావేంట్రా పిచ్చి సన్యాసీ?"

తల్లి పిలుపునకు రాము ఉలిక్కిపడ్డాడు.

వంటిమీద బట్ట విప్పేసి నీళ్ళతో కాళ్ళూ చేతులు కడుక్కొని దండెం మీద ఆరేసి వున్న మడి అంగవస్త్రం కట్టుకున్నాడు. తల్లి ప్రక్కకి వచ్చి నిలబడ్డాడు.

ఆమె పూజగది గడప బయట కూర్చొని వుంది. "తండ్రీ వేంకటరమణా, వడ్డికాసులవాడా!" అని మాటిమాటికీ గొణుక్కుంటోంది.

తల్లి చెప్పగా రాము మెల్లగా పూజ గదిలోకి వెళ్ళాడు. ఆ గదిలో అంతగా వెలుతురు ఉండదు. చెమ్మగా, చల్లగా ఉంటుంది. అందులో అడుగుపెట్టాలంటేనే రాముకెందుకో భయం, ఎందుకో గుండెల్లో సన్నగా కలవరం రేగుతుంది. చిన్నగా వణుకు పుట్టుతుంది.

ఆ గదిలో ఈశాన్యపు మూల, క్రింద కూర్చుని పూజ చేయటానికనువుగా దేముడి గూడు వుంది. ఆ గూట్లో ఎదురుగా వాళ్ళ కులదైవమైనటువంటి శ్రీ వేంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవారి సహితులై కొలువుదీరి వున్నారు. మరోప్రక్క శివపార్వతులు వెండికొండపై వేంచేసి వున్నారు. రమా సహిత శ్రీ అన్నవరం సత్యనారాయణ స్వామివారూ, లక్ష్మీదేవీ, శ్రీ దాసాంజనేయ స్వామి, ఇంకా ఎంతోమంది దేముళ్ళూ, దేవతలూ, ఆ దేముడి గూట్లో క్రిక్కిరిసి వున్నారు. ఇంతమంది దేముళ్ళ సమక్షంలో శ్వాసను బంధించి యోగసమాధి స్థితిలో వున్న బాలయోగిలాగా మూతికి పసుపు గుడ్డ కట్టిన ముడుపుల రాగి చెంబు ఒకటి ఉంది. వడ్డికాసుల వాడికి ప్రతి శనివారం పూజ చేసి అందులో పావలా పరకా కానుకలుగా వేస్తుంటారు. అడపా దడపా రూపాయి, అర్ధరూపాయి కూడా వేస్తుంటారు. ఇంట్లో కరువుగా ఉన్నా చిల్లర డబ్బుల్తో అది ఎప్పుడూ బరువుగానే ఉంటుంది.

"ఆ ముడుపుల చెంబుని జాగ్రత్తగా బయటికి తీయి. దానికి కట్టిన పసుపు గుడ్డను విప్పు. అందులోని కానుకలను అదిగో ఆ రాగి పళ్ళెంలోకి వంపు. అన్నీ దిమ్మరించకురా. కొంత చిల్లర వుంచు. ఆ పళ్ళెం తీసికొచ్చి నాకివ్వు. గుమ్మంలోంచి ఇవ్వకూడదురా - గుమ్మం దాటి బయటికి రారా తండ్రీ!'

ఇలా తల్లి హెచ్చరికలు చెప్తుంటే తాను ఆమె చెప్పినట్లు చేశాడు. ఆ కానుకల పళ్ళాన్ని తల్లి ముందు పెట్టాడు.

ఆమె ఒకప్రక్క కానుకలను లెక్కపెడుతూ, మరోప్రక్క కంటతడి పెడుతూ, "తండ్రీ వడ్డీకాసుల వాడా, నీ డబ్బు ఇలా వాడుకుంటున్నాం. నీ బాకీని మళ్ళీ త్వరలో రూపాయికి పావలా చొప్పున వేసి వడ్డీతో సహా తీర్చేస్తాం తండ్రీ! ఏం చెయ్యమంటారు తండ్రీ, ఆకలితో పస్తులతో చావలేం కదా! మా అపరాధాన్ని మన్నించు తండ్రీ!' అని గొణుగుతూంది.

ఈలోపల రాము మళ్ళీ ఆ ఖాళీ ముడుపుల చెంబుకి పసుపుగుడ్డ కట్టేసి, దాన్ని దేముడి గూట్లో పెట్టేశాడు. అంగవస్త్రాన్ని విప్పేసి, కోపంగా దాన్ని ఒక మూలకు విసిరేశాడు. మళ్ళీ మామూలు 'తోకలాగు', చొక్కా తొడుక్కున్నాడు. ఇంతలో వాళ్ళమ్మ చిల్లర డబ్బులన్నీ ఒక కాగితంలో పొట్లం కట్టింది. ఆ కాగితం పొట్లమూ, ఒక పాత సంచీ రాము చేతికిచ్చింది.

"కోమటి పద్దయ్య కొట్టుకెళ్ళి మూడుసేర్లు బియ్యం, సవాశేరు కందిపప్పు పట్రా. ఇక్కడ ఉన్నట్లు వచ్చేయాలి! నీవు రాగానే నేను మడి కట్టుకుని ఎసరు పడెయ్యాలి!" అని చెప్పి పంపించింది.

పద్దయ్య దుకాణం ఎప్పుడూ జనంతో కిటకిటలాడుతూ వుంటుంది. రాము వెళ్ళేసరికి ఐదారుగురు దాకా ఉన్నారు. పద్దయ్య బిజీగా బేరంచూచుకుంటున్నాడు. పొయ్యేవాళ్ళు పోతున్నారు. వచ్చేవాళ్ళు వస్తున్నారు. తనని మాత్రం పట్టించుకోవటం లేదు. అక్కడికీ "మూడు శేర్లు బియ్యం!" అని మూడు నాల్గుసార్లు అడిగాడు. నాల్గోసారి అడిగినప్పుడు "డబ్బులు తెచ్చావా?" అని పద్దయ్య గదమాయించాడు. తాను చెయ్యి ముందుకు చాపి చిల్లర పొట్లం చూపించాడు. అది చూచి మొగం చిట్లించాడు. "ఆగూ, ఆ చిల్లరంతా లెక్కపెట్టుకుంటూ కూర్చుంటే ఈ బేరం ఎవడు చూస్తాడు? ఎక్కడెక్కడో చిల్లరడబ్బులడుక్కువచ్చి మా పేనాలు తీస్తారు!" అని విసుక్కున్నాడు.

తాను చిన్నబుచ్చుకున్నాడు. సంభావ బ్రాహ్మలంటేనే ఒక మాదిరి చిన్నచూపు. బీద బ్రాహ్మణులను చూస్తే మరీ చిన్నచూపు. అందులోనూ ఇలా చిల్లర పొట్లాలు తీసుకొచ్చిన తనలాటి చిన్న వెధవలను చూస్తే మరీ చులకన!

వేసవి కాలపు వడగాలి విసిర్విసిరి కొట్టుతూంది. చేతిచెమటకు పొట్లం కాగితం తడుస్తోంది. ఒకప్రక్క కాళ్ళవెంట చెమట ధారలుగా కారుతోంది. మరోప్రక్క కడుపులో ఆకలి మంట. నిల్చుని నిల్చుని కాళ్ళు పీకుతున్నాయి. అతని చిన్నారి మనస్సు కోపంతో కుతకుతలాడిపోతోంది. కాని, ఏం చేస్తాడు? నిస్సహాయ స్థితి.

పద్దయ్య బేరమంతా చూచుకుని అప్పుడు తాపీగా, "ఈ చిల్లరంతా ఏక్కడ తెచ్చావు పంతులూ? ఏరుకాడ మీ అయ్యకొచ్చిన సంభావన డబ్బులా?" అన్నాడు.

కాదని తల ఊగించాడు. ఆ సంభావన డుబ్బుల్లేకే దేముడి ముడుపుల చెంబు మూతి విప్పవలసి వచ్చింది. తన తండ్రికీ ఈ మధ్య వణుకు వచ్చింది. చేతికి వణుకు, మాటకు వణుకు. మంత్రాలు సరిగ్గా చదవలేకపోతున్నాడు. ఏటి దగ్గర ఎవ్వరూ ఆయనచేత ఇదివరకులా సంకల్పాలు చెప్పించుకోవటం లేదు. ఆయన సంపాదన కుంటుపడేసరికి ఇంట్లో కటకటా!

"ఎక్కడ్నుంచి తెస్తే నాకేం గాని, ఇదుగో పంతులూ! ఆ ప్రక్కన కూర్చుని ఆ చిల్లరంతా అణాలకు

అణాలూ, బేడలకు బేడలు పోగులు పెట్టు. నేను వచ్చి లెక్క చూచుకుంటా!" అని లోపలికి వెళ్ళాడు.

ఈ మాట ఇందాకనే చెప్పి ఉన్నట్లయితే ఈపాటికి ప్రోగులు పెట్టి ఉండేవాడు. మళ్ళీ ఇదొక ఆలస్యం! బయట ఎండ నిప్పులు చెరుగుతుంటే, వడగాలి విసురుగా మొగానికి కొట్టుతుంటే కోమటాయన పంచలో గొంతుక్కూర్చుని చిల్లర ప్రోగులు పెట్టసాగాడు. పిక్కల్లోంచి చెమటలు కారుతున్నాయి. ఊరికే దాహం వేస్తోంది. ఆకలికి తట్టుకోలేక కళ్ళు తిరుగుతున్నాయి. ఈ సన్నివేశాన్ని రాము జీవితంలో ఎప్పుడూ మర్చిపోలేదు. అతని పసిమనస్సు మీద అంత గాఢంగా ముద్రవేసింది. ఇదంతా ఆ దౌర్భాగ్యపు అంగవస్త్రం మూలంగానే అని పదేపదే అనుకున్నాడు. దాన్ని కట్టుకున్న రోజున ఇలాగే పరమ దరిద్రంగా గడుస్తుంది.

పద్దయ్య సుష్టుగా భోంచేసి 'బ్రేవ్'మని త్రేన్చుతూ బొజ్జ సవరించుకుంటూ -

"ఏం పంతులూ, చిల్లరంతా నేను చెప్పినట్లు పోగులు పెట్టావా?" అంటూ ఇంట్లోంచి బయటికొచ్చేసరికి మరో ముప్పావుగంట పట్టింది. అంతసేపూ రాము ఆ పంచలో పడిగాపులు పడుతూ కూర్చున్నాడు. అంతసేపూ అతని చిన్నారి మనస్సు సిగ్గుతో చితికిపోయింది. ఆపుకోలేని దు:ఖంతో కుమిలిపోయింది. నిస్సహాయతతో నీళ్ళుకారిపోయింది.

బియ్యం సంచిలో పోయించుకొని, కందిపప్పు పొట్లాం కట్టించుకున్నాడు. సంచి భుజాన తగిలించుకొని రాబోతుంటే పద్దయ్య పాపం ఏమనుకున్నాడో ఏమో "ఇంద పంతులూ, ఈ బెల్లంముక్క తీస్కో!" అని ఇవ్వబోయాడు.

రాము తీసుకోలేదు. "నాకక్కర్లేదు!" అని విసురుగా వచ్చేశాడు. పద్దయ్య విస్తుబోయి చూశాడు.

ఎండకు అరికాళ్ళు బొబ్బలెక్కిపోతుంటే వడివడిగా నడుచుకుంటూ ఇంటికి వచ్చాడు.

దేముడి గది గడపదగ్గర మునగతీసుకుని కూర్చొని తల్లి తనకోసం ఎదురు చూస్తోంది.

"ఇంత ఆలస్యం అయిందేరా రామూ!" అంది. తను పలకలేదు. భుజాన వున్న సంచిని తీసి కోపంగా క్రింద పడేశాడు.

అప్పుడు హడావుడిగా ఆమె రెండు చెంబులు నీళ్ళు పోసుకొని మడికట్టుకుని వంట ప్రారంభించింది.

వంటయి తాను అన్నం తినేసరికి మూడుగంటలు దాటింది. తాను గాబుదగ్గర చెయ్యి కడుక్కుంటుంటే, అప్పుడు వాళ్ళ నాన్న చేతిలో ఖాళీ సంచితో, కడుపులో ఆకలి మంటతో, మొగంలో బోలెడు దైన్యంతో, కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకొని కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి వచ్చాడు....

రాము తడిచెయ్యి తుడ్చుకుంటూ చూస్తే అది ఇందాక తాను విసిరేసిన అంగవస్త్రం! మళ్ళీ 'ఛీ' అని కోపంగా దాన్ని దూరంగా విసిరేశాడు. బాదంచెట్టు క్రింద నులకమంచం వాల్చుకుని పడుకున్నాడు.

రామువాళ్ళ దీనస్థితికి బాదంచెట్టు జాలితో కన్నీరు కారుస్తోందా అన్నట్లు, పండిపోయిన బాదం ఆకులు వుండి వుండి టప్పున నేలరాలుతున్నాయి.

మళ్ళీ అదే రాము - తల్లి కొంగుచాటు బిడ్డగా, బామ్మ వొడిలో కూర్చునే అయిదారేళ్ళ పిల్లవాడిగా ఉన్న రోజుల్లో జరిగిన మరో సంఘటన ..........

అది చిన్న తిరపతి (ద్వారకా తిరుమల) కొండ - అదొక తెల్లవారుఝాము సమయం. ఇంకా చీకటి చీకటిగానే వుంది. చిరు చలిగా వుంది. ఆకాశంలో నల్లమబ్బులూ, తెల్లమబ్బులూ వర్ణభేదం లేకుండా కలిసికట్టుగా గుంపులుగుంపులుగా ఎక్కడికో తరలిపోతున్నాయి. రాము వాళ్ళ బామ్మ ఒడిలో మునగదీసుకొని కూర్చున్నాడు. వాళ్ళ బామ్మ తాను కట్టుకున్న ఎనిమిది గజాల ముతక మల్లుపంచె పమిట చెంగును బారుగా తీసి రాము భుజాల మీదుగా కప్పింది. బామ్మ ఒడిలో రాముకు వెచ్చగా హాయిగా వుంది.

బామ్మను అలా కర్చుకొని కూర్చొని ఎర్రగా, వింతగా వెలుగుతున్న ఆముదపు దివిటీల వంక కళ్ళార్పకుండా చూస్తోన్నాడు.

ధ్వజస్తంభం దగ్గర వెలుగుతున్న దివిటీ కాంతి, రాము వాళ్ళన్నయ్య సుబ్బావధాని మొగంమీద పడుతూ రెపరెపలాడుతూ వింతగా వుంది. అతడు సన్నగా, ఎర్రగా, పొడుగ్గా వున్నాడు. అతడ్ని పసుపు రంగు క్రొత్త అంగవస్త్రంతో ధ్వజస్తాంభానికి కట్టేశారు. అమ్మకానికి సంతలో కట్టేసిన లేగదూడలాగా అతడు దిగులుగా, భయంగా, బిత్తర చూపులు చూస్తోన్నాడు.

వాళ్ళన్నయ్య నడుం చుట్టూ కట్టిన ఆ అంగవస్త్రం రాము కళ్ళకు పది తలకాయల పసుప్పచ్చ త్రాచుపాము లాగా కనిపిస్తోంది. దాని చివర్లు పాము పడగల్లాగా కనిపిస్తున్నాయి.... రాము భయంతో గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

ఇంతలో రాము తండ్రి దేవస్థానం సిరస్థదార్ను పిల్చుకొని వచ్చాడు. ఆయన కాసేపు "కానియ్యండి...... కానీయ్యండి!" అంటూ హడావుడి చేశాడు. అప్పుడు వేలం పాట మొదలైంది.

స్థిరాస్థదారు గారు "శ్రీ ద్వారకా తిరుమల శ్రీశ్రీ వేంకటేశ్వర స్వామి వారి పాట ఒక్క రూపాయి! శాస్త్రీ నీ పాటెంతో చెప్పవయ్యా!" అన్నాడు.

రాము తండ్రి, "పాతిక రూపాయలు!" అన్నాడు.

దేవస్థానం అధికారం "స్వామి వారి పాట ఏభై రూపాయలు!" అన్నాడు.

రాము తండ్రి "మా పాట డెబ్భై అయిదు రూపాయలు!" అన్నాడు.

వేలంపాట ఇలా సాగి, చివరికి "నూటపదహార్లకు" రాముతండ్రి పేర పాట కొట్టేశారు. ఆయన పైకం చెల్లించాడు. స్థిరాస్థుదారు స్వామివారు తరపున పైకం తీసుకొని స్వామివారి తరపున సంతకం చేసి రశీదు ఇచ్చాడు.

ఆ రశీదు తీసుకొని దేవాలయం బంట్రోతు సుబ్బావధాని నడుంకు కట్టిన అంగవస్త్రాన్ని విప్పదీసి అతన్ని విడుదల చేశాడు.

రాము, బామ్మ హడావుడిగా ఎదురెళ్ళి "నాబిడ్డే నా తండ్రే!" అంటూ మనవడ్ని సందెట్లోకి పొదుముకుంది.

ప్రేమగా తల నిమురుతూ "నిన్ను ఆ తిరుపతి వెంకన్న దగ్గర్నుంచి వేలంపాటలో కొనుక్కున్నాం. నీకిది పునర్జన్మరా సుబ్బా!" అంది. అతడు బామ్మ భుజం మీద తల ఆనించి సిగ్గుపడ్డాడు. అతనికి ఆర్నెల్ల క్రితం డబుల్ టైఫాయిడ్ వచ్చింది. అందరూ ఆశలు వదులుకున్నారు. అప్పుడు ముసలమ్మ

ఆ తిరుపతి వెంకన్నకు మ్రొక్కుకుంది. ఆ వెంకన్న దయవల్ల మనుమడు బ్రతికాడు. ఆ మ్రొక్కు ప్రకారం పిల్లవాడు ఆ వెంకన్న మనిషే! ఆయన బానిస! మళ్ళీ వేలంపాటలో మనమడ్ని స్వామి వారి దగ్గర్నుంచి కొనుక్కున్నారన్న మాట! ఆ రోజుల్లో ఇలాటి మ్రొక్కులు కూడా ఉండేవి.

రాము తల్లి కొంగు పట్టుకొని కన్నార్పకుండా ఈ తతంగమంతా చూస్తోన్నాడు. ఇంకా వాళ్ళన్నయ్య భుజం మీదే ఉన్న పసుపురంగు అంగవస్త్రం యింకా తనకి పాములాగే అనిపిస్తోంది. దాన్ని తీసిపారేస్తే బాగుణ్ణు అని మనస్సులో మాటిమాటికీ అనుకున్నాడు.

మరారోజు వేలంపాట సొమ్ము ముట్టినట్లు సంతకం చేసి రశీదు ఇచ్చిన వడ్డీకాసులవాడి వడ్డీ లెక్కల్లో మరి ఏదైనా తఖరారు వచ్చిందో ఏమో, ఇది జరిగి ఆర్నెల్లు తిరక్కుండానే మళ్ళీ సుబ్బావధాన్ని శాశ్వతంగా తన దగ్గరికి పిలిపించుకున్నాడు. దర్భలు తీసుకొని రావటానికెళ్ళినతన్ని పాము కాటేసింది! పదిహేనేళ్ళు కూడా నిండకుండానే రాము అన్నయ్యకు, నూరేళ్ళు నిండిపోయాయి.

ఆనాటి ఎనిమిదేళ్ళ అమాయకుడైన ఆ రామే నేను - ఈనాటి ఏభైఏళ్ళ రామశాస్త్రిని!

నేను చిన్నప్పట్నుంచీ అంగవస్త్రాన్ని ద్వేషించడానికి మరో కారణం కూడా వుంది. మా అన్నయ్య అలా అర్థాంతరంగా చనిపోయిన దగ్గర్నుంచి మా నాన్నగార్కి గొంతుకు వణుకు వచ్చింది. సంపాదన పోయింది. చక్రం ఊడిపోయి, ప్రక్కకు ఒరిగిపోయిన బండిలాగా ఉండేవాడు. వట్టిపోయిన ఆవు లాగా ఏటి దగ్గర, రోడ్ల వెంబడి తిరిగేవాడు. చివరి రోజుల్లో మతి స్థిమితం లేనివాడులాగా, ఎప్పుడూ తనలో తాను గొణుక్కుంటూ, మోకాళ్ళు దిగని అంగవస్త్రం కట్టుకొని ఇంటి పెరట్లో నేవుకుంటూ అస్థిరంగా అటూ ఇటూ తిరిగేవాడు. ఆయన కట్టుకున్న అంగవస్త్రం నశ్యం మరకల్తో మురిగ్గా చూడ్డానికి అసహ్యంగా వుండేది.

అది కట్టుకునే వసారా పంచలో చింకి చాపమీద పడుకుని ప్రాణాలు వదిలాడు. దానిమీదే మా నాన్నగారి శవానికి కడసారి స్నానం చేయించారు!!

* * *

మాటా మంతీ లేకుండా, ఎటో శూన్యంలోకి చూస్తూ గోడకు జారగిలబడి కూర్చున్న నన్ను చూచి వడియాలు పెడుతున్న మా ఆవిడ "ఆదేంటండీ అలా ఉన్నారు? వంట్లో బాగోలేదా? అయ్యో, మాట్లాడరేమిటండీ బాబు? అమ్మాయి శాంతీ, ఎక్కడున్నావు? ఒక్కసారి ఇలా బయటికి రా? నా చెయ్యి వల్లకాదు. మీ నాన్నగార్ని చూడు!" అని కేకేసింది.

లోపల్నుంచి మా అమ్మాయి కంగారుగా బయటికి వచ్చింది.

నా అవతారం చూచి.... "అలా ఉన్నారేంటి నాన్నగారూ? వంట్లో బాగోలేదా?" అంది - నుదురు మీద చెయ్యి పెట్టి చూస్తూ.

బలవంతంగా చిర్నవ్వు తెచ్చుకుంటూ "ఏం లేదమ్మా, బాగానే ఉన్నాను!" అన్నాను.

"అలా డీలా పడి కూర్చుండిపోయి ఏం లేదంటారేంటి? వుండండి. ఫ్యాను కింద మంచం వేస్తాను - కాస్సేపు నడుం వాల్చండి. ఈ లోపల కాస్త హార్లిక్స్ కలుపుకొస్తాను. ముందా చొక్కా విప్పండి - ఆ

కళ్ళద్దాలిలా ఇవ్వండి...'' అంటూ ఇలా తెగ కంగారుపడిపోయి నాకు ఉపచారాలు చెయ్యడం మొదలు పెట్టింది. పిచ్చితల్లి, నేనంటే ఎంత ప్రేమో! శాంతిని చూసినప్పుడల్లా ఆమెలో మా అమ్మే కనిపిస్తుంటుంది.

మాకు వరుసగా ముగ్గురు మొగపిల్లలు పుట్టిపోయిన తర్వాత ఈ నిష్ట దరిద్రుడి కడుపున అష్ట లక్ష్మి లాగా పుట్టింది శాంతి. బంగారు మేనిఛాయతో పెద్ద పెద్ద కళ్ళతో మంచి కళగల మొగంతో నిజంగానే లక్ష్మీదేవిలాగా ఉంటుంది. ఆ పోయిన మొగపిల్లలు మాత్రం! పుట్టినప్పుడు బొద్దుగా గుమ్మడి పండుల్లాగా, ఎర్రగా ముద్దుగా ఉండేవాళ్ళు. అదేం దురదృష్టమో, మరే దేముడు పెట్టిన శాపమో తెలియదు. రెండేళ్ళు తిరక్కుండానే భయంకరమైన లివర్ జబ్బు వాతపడేవాళ్ళు. కాళ్ళూ చేతులూ సన్నగా పుల్లల్లాగా అయిపోయేవి. పొట్ట బానలాగా ముందుకెళ్ళుకొచ్చేది.

ఇంగ్లీషు మందులూ, చింతలూరి వారి ఆయుర్వేదం మందులూ, ఏవో పసర్లూ, లేహ్యాలూ - ఇలా ఇది కాదని అదీ, అది కాదని ఇదీ వాడేవాళ్ళం. అయినా ఆ పాపిష్టి రోగం తగ్గేది కాదు. రెండేళ్ళు తిరక్కుండానే వాళ్ళకు నూరేళ్ళు నిండేవి. ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు మమ్మల్ని దగా చేసి పొయ్యేవాళ్ళు. మాకు తీరని గర్భశోకం కలిగించేవాళ్ళు. ఇలా ఒకరు తర్వాత ఒకరు మాకు దక్కకుండా పోతుంటే ప్రతిసారీ వాళ్ళ మృతదేహాలను కొత్త అంగవస్త్రాల్లో చుట్టి భుజానేసుకొని పోయి మా వూరి చెరువు దగ్గర భూస్థాపితం చేసేవాడ్ని.... అందుకే నాకు క్రొత్త అంగవస్త్రాలను చూస్తే మహా ఎలర్జీ! వాటిని చూస్తే చనిపోయిన ఆ మొగపిల్లలు గుర్తుకు వచ్చేవాళ్ళు. కళ్ళముందు వాళ్ళ మృత దేహాలు కనిపించేవి! ఇంకా గతంలోకి పోతే పైన చెప్పిన కథ! నా బాల్యపు రోజుల్లోని ప్రతి విషాద సంఘటనకు ప్రతీకలుగా నిల్చిన ఈ అంగవస్త్రాలను ఐ హేట్!

ఇంతలో శాంతి వేడి వేడి హార్లిక్స్ తీసికొచ్చింది. నాచేత బలవంతంగా త్రాగించింది. కళ్ళు మూసుకుని నిద్రపొమ్మని చిన్నపిల్లవాడికి చెప్పినట్లు చెప్పింది. గాలి కావాలని కిటికీ తలుపులు తీసింది. నిశ్శబ్దంగా ఉండాలని, నాకు నిద్రాభంగం కలగకూడదని గది తలుపు దగ్గరజేసి వెళ్ళింది. నాతల్లి, అచ్చం మా అమ్మే!

ఆ ముగ్గురు మొగపిల్లలు పోయాక పుట్టిందని అస్సలు మొదట్లో ఈ పిల్లను గురించే పట్టించుకునేవాడ్ని కాదు! దీని ఆలనా పాలనా పట్ల శ్రద్ధ చూపేవాడ్ని కాదు. ఆ ఇది మాత్రం దక్కే సంతానమా? బ్రతికేదా, బట్టకట్టేదా అనుకునేవాడ్ని! ఇవ్వాళ కాకపోతే రేపు. ఈ ఏడు కాకపోతే వచ్చే ఏడూ, ఇదీ వాళ్ళ అన్నల్లాగే. మమ్మల్ని దగా చేసి పోతుందనుకునేవాడ్ని!

ఆ మొగపిల్లలు మాకు గర్భశోక సాగరాలను కల్పించి పోతే, మా అమ్మాయి శాంతి వాట్ని క్షీరసాగరాలుగా మార్చి అందులోంచి ఆవిర్భవించి లక్ష్మీదేవిలాగా దినదిన ప్రవర్ధురాలై యుక్తవయస్కు రాలైంది. చక్కని రూపం అమోఘమైన తెలివితేటలూ, వీట్ని మించి అతి సున్నితమైన మనస్సూ! నేనన్నా, వాళ్ళమ్మన్నా ప్రాణం పెట్టుతుంది!

స్కూలు ఫైనల్ పరీక్షల్లో మా జిల్లా కంతటికీ ప్రథమ శ్రేణిలో ప్యాసయింది. కాలేజీలో జాయిన్ అవుతా నాన్నగారూ అంది. తల్లీ, నీవు నా పరిస్థితి చూస్తూనే ఉన్నావుగా! ఎలాగో కష్టపడి నీకు కాలేజీ

చదువు చెప్పిస్తా. నీవు ఏ బియ్యేనో చదువుతావు. నీ చదువుకు సరిపోయినవాడు కావాలంటే ఏ ఎమ్మే చదివినవాడ్ని తీసుకురావాలి. అది నాకయ్యేపనేనా తల్లీ అన్నాను. మరో మాట మాట్లాడకుండా 'అలాగే నాన్నగారు' అంది. "ఇంట్లోనే ఉంటూ, పోనీ టైపు నేర్చుకుంటాను' అదీ, మీకభ్యంతరం లేకపోతే!'' నేను అలాగే తల్లీ అన్నాను.

మా శాంతి ఈ కాలపు పిల్లల్లాగా కాదు. కష్టం సుఖం తెలిసిన పిల్ల. ఎంతో అణుకువ. పేరుకు తగ్గట్లే శాంత స్వభావురాలు.

ఆ తర్వాత పెళ్ళి సంబంధాలు వెతకటం మొదలు పెట్టాను. ఎన్నో సంబంధాలు చూశాం. అందరూ ముందు పిల్ల అపరంజి బొమ్మ అని మెచ్చుకునేవాళ్ళు. తీరా కట్నకానుకాదుల దగ్గరికి వచ్చేసరికి మాకు మీ సంబంధం నచ్చలేదనే వాళ్ళు. నా తాహతుకు మించి అడిగేవాళ్ళు. ఇలా ఎన్నో తప్పిపోయాయి. శాంతి నావంక జాలిగా చూసేది. నాకేం కష్టమొచ్చినా పిల్ల అల్లాడిపోయేది.

చివరికి ఎలాగో ఈ సంబంధం కుదిరింది. మా మేనమామ కుదిర్చాడు. వాళ్ళ వూరి పిల్లవాడు. ఏదో చిట్‌ఫండ్ కంపెనీలో పన్జేస్తున్నాడు. జీతం తక్కువైనా పిల్లవాడు యోగ్యుడు. ఉండటానికి సొంత ఇల్లుంది.

నా ప్రొవిడెంట్ ఫండ్ లోంచి లోను తీసుకున్నాను. అదీచాలకపోతే ఈ ఇంటిమీద అప్పు జేశాను. దగ్గర్లోనే ముహూర్తాలు కుదిరాయి. పెళ్ళి పన్లు కూడా ప్రారంభించాం. పెళ్ళి సరుకు లిస్టులో కొత్త అంగవస్త్రాల మాట రాగానే అది నా గుండెలో ఎక్కడో తగిలింది. గతం గుర్తుకు వచ్చింది. మనస్సులో ఏదో అలజడి రేపింది....

* * *

భగవంతుని దయవల్ల ఇవ్వాళ తెల్లవారుగట్ల మా వూరి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి సత్రంలో పెళ్ళికూడా లక్షణంగా జరిగిపోయింది. ఇంకా బోలెడు పెళ్ళి పన్లున్నా, ఆ క్షణంలో నాకు గుండెల మీద నుంచి పెద్ద బరువు దిగిపోయినంత రిలీఫ్‌గా వుంది.

సత్రం నుంచి వియ్యాల తరపు వాళ్ళూ, మా బంధువులూ అంతా మా ఇంటికి వచ్చారు. అప్పగింతల కార్యక్రమం ఇంకా మిగిలి వుంది. పెళ్ళి కొడుకు, పెళ్ళి కూతురుకు నలుగులూ, తలంటు స్నానాలు చేయించే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇల్లంతా బంధువులతో, పెళ్ళి సందడితో, నవ్వుల్తో, చతురోక్తుల్తో, సరసాల్తో ఆనందం వెల్లివిరిసినట్లుంది.

ఇంతలో ఏం జరిగిందో ఏమో, నేను సరిగ్గా గమనించలేదు. నా హడావుడిలో నేను ఉన్నాను. ఉండీ ఉండీ నవ్వులు ఆగిపోయాయి. సందడి సద్దుమణిగింది. ఆ స్థానే ఒక భయంకరమైన నిశ్శబ్దం ఆవరించింది. జట్లుజట్లుగా తలా ఒక మూల జేరి గుసగుసలాడుకుంటున్నారు. నోళ్ళు నొక్కుకుంటున్నారు.

నా చేతిలో ఉన్న వస్తువును ప్రక్కన పడేసి, "ఏవయిందర్రా?" అని అడిగాను. ఎవ్వరూ ఏం మాట్లాడలేదు. ప్రక్కకు జారుకుంటున్నారు. మొగాలు చాటుచేసుకుంటున్నారు.

నాకు బి.పి. పెరిగిపోయింది.

"ఏమయిందని అడుగుతుంటే ఎవ్వరూ చెప్పేడ్వరేం? అలా చూస్తారేమిటి? అస్సలేం జరిగింది?' ' అని గట్టిగా అడిగాను.

నాకు వరసకు అక్కయ్య అయ్యే భాగ్యం కళ్ళొత్తుకుంటూ ముందుకు వచ్చింది. నా దగ్గరికి వచ్చి రహస్యం చెప్పుతున్నట్లు గొంతు తగ్గించి, "పెద్ద అన్యాయమే జరిగిపోయిందిరా తమ్ముడూ! '' అంది గద్గద స్వరంతో.

"నాక్కాస్త అర్థమయ్యేట్లు చెప్పు అక్కయ్యా!'' కంగార్ను అణుచుకుంటూ అన్నాను.

"అన్యాయం గాక మరేంట్రా? తెలియక పిల్లదాని గొంతు కోశాం!"

అన్యాయం జరిగింది నా తల్లి శాంతికా? నా నవనడులూ కృంగిపోయాయి.

"నీ కూతురు అందరిలాంటి పిల్ల ఏవన్నానా? బంగారు తల్లి అపరంజిబొమ్మ!'' అంది.

"అద్సరే. అసలు విసయమేంటి శాంతికి జరిగిన అన్యాయమేంటి?"

"ఇంకేం కావాల్రా? బంగారు బొమ్మను తీసికెళ్ళి రోగిష్టి వెధవకు కట్టబెట్టావురా తమ్ముడు? పెళ్ళి కొడుక్కి కుష్ఠురోగమంట....''

ఓర్నాయనోయ్..... నిలుచున్నచోటే నేను కుప్పకూలి పోయాను.

"ఈ రోగం వాడికి ఎప్పట్నుంచో ఉందంట. మనకు తెలినీయకుండా మోసం చేశారు. ఇంత మోసం, దగా ఎక్కడైనా ఉందా. ఆ పిల్లవాడికి తలకు నూనెపెట్టి, హారతులిచ్చి నలుగు స్నానం చేయించటానికి నీవు తీసుకొచ్చిన కొత్త అంగవస్త్రం ఇచ్చి కట్టుకోమన్నారంట.."

మళ్ళీ ఇక్కడ కూడా అంగవస్త్రమే! ఈ పాపిష్టిది నన్ను ఒక పట్టాన వదలదు.

"...... ఇంతలో మా సరోజ నూనెగిన్న ఇవ్వటానికెళ్ళి చూచిందంట. ఆ అబ్బాయికి వళ్ళంతా తెల్లటి మచ్చలున్నాయంటు నాకొచ్చి చెప్పింది. మా కనుమానం వచ్చి వాళ్లవైపు అమ్మలక్కల్ని ప్రక్కకి పిల్చి, అడిగాం. ఏమంటారు? వాళ్ళు నోళ్ళు వెళ్ళబెట్టారు? వాళ్ళ మేనత్తంట అవునమ్మా నిజమే! మందులిప్పిస్తున్నాం అంది. మీకి విషయం తెలుసే అనుకున్నాం. ఈ విషయం నర్సింహం శాస్త్రికిక్కూడా తెల్సే అంది''..... భాగ్యమ్మక్కయ్య ఇలా చెప్పుకుపోతోంది.

నేను కుప్పకూలిపోయి - అప్పటిదాకా ఉన్న ఆనందమంతా ఆవిరైపోయి - గుండెలు భగ్గున మండిపోయి - ప్రాణాలు కడబట్టి నీర్సగా గోడకు జారగిలబడి ఆమె చెప్పుతున్నది వింటున్నాను.

"..... అదేంట్రా తమ్ముడు, నర్సింహశాస్త్రి నీకు సొంత మేనమామమైవుండి ఇంత మోసం చేశాడు. నీకీ విషయం ముందుగా చెప్పలేదా?'' అంది.

"చెప్పలేదక్కయ్యా! చెబితే ఈ పెళ్ళి చేసేవాడ్నా. నా తల్లి గొంతు కోసేవాడ్నా?'' రెండు చేతుల్తో తలపట్టుకున్నాను.

ఇంతలో మా ఆవిడా వాళ్ళ అక్కచెల్లెళ్ళూ అందరూ పమిటచెంగులు నోళ్ళకడ్డుపెట్టుకొని ఏడుస్తూ వచ్చి నాచుట్టూ మూగారు. అవధానిగారి భార్య సోమిదేవమ్మా, రంగాచార్లు భార్యఅరుంధతి, సుబ్బులు పిన్నీ మిగతా అమ్మలక్కలంతా కూడా మా దగ్గరికి జేరారు. వాళ్ళేదో అంటున్నారు. నాకేం వినిపించడం

లేదు. నా భార్య వెక్కి వెక్కి ఏడ్వడం మాత్రం తెలుస్తోంది.

ఈ లోపల ఎవరో మా మేనమామ నర్సింహశాస్త్రిని పిల్చుకువచ్చారల్లే వుంది. ఆయన అంటున్నారు - "అవునమ్మా. ఈ రోజుల్లో కుష్ఠురోగం ఏవంత భయంకరమైంది కాదు. అంటురోగం అస్సలే కాదు. దానికీ మంచి మందులు కనిపెట్టారు....?"

"ఈ విషయం మీరు ముందు చెప్పి ఉండవల్సింది. ఇష్టమైతే చేసుకుండేవాళ్లు. లేకపోతే లేదు. ఎందుకు రహస్యంగా ఉంచారు?" ఎవరో అన్నారు.

"నాకు తెలియకగుడుతా.... నేనీ విషయం ముందుగా చెపితే ఏవయ్యేది? ఈ సంబంధం కూడా తప్పిపోయేది? ఇప్పటికే ఇరవై రెండేళ్ళు ముడ్డి క్రింద కొచ్చి కూర్చుంది.... ఇంకో పదేళ్ళు కూర్చునేది!" అన్నాడాయన ఏదో నిర్వాకం చేసినట్లు.

"చాల్లేవమ్మా పెద్దమనిషి! వాళ్ళకెంతమంది పిల్లలున్నారని ఇంటపడివుంటే ఉంటుంది. అందుకని చూస్తూ చూస్తూ కుష్టువాడికి కట్టబెడతామా? అదే, మీ అమ్మాయికైతే చేసేవాడివా?...." అని సోమిదేవమ్మగారు జాడించింది.

మిగతా అమ్మలక్కలు కూడా తలా ఒకమాటనేసరికి ఆయన మెల్లగా జారుకున్నాడు.

ఇంతలో మా మేనత్త "ఓసినా తల్లో, మీరంతా ఎక్కడ తగలడ్డార్రా, అయ్యో ఇదేం అఘాయిత్యమే తల్లీ!....." అని కేకలు పెట్టసాగింది.

ఆడవాళ్ళంతా అటుకేసి పరుగెత్తారు. నేను వంటరిగా మిగిలిపోయాను.

అంతలోనే లోపల్నుంచి కేకలూ, ఏడ్పులూ - "అయ్యో, అయ్యో! ఇదేంటే?" అంటూ ఆర్తనాదాలు వినిపించాయి.

ఆ కేకలకు దొడ్లోను, వాకిట్లోనూ కాఫీలు త్రాగుతున్న మొగవాళ్ళంతా అటు పరుగెత్తారు.

ఒక ఉదుట్న లేచి నేనూ లోపలికి పరుగెత్తాను.

శాంతి గది ముందు అందరూ మూగివున్నారు. ఆడవాళ్లు తలలు కొట్టుకుంటూ శోకాలు పెట్టి ఏడుస్తున్నారు.

అందర్నీ తోసుకుని ముందుకెళ్ళాను. గుమ్మం దగ్గరే నా కాళ్ళు ఆగిపోయాయి. నా చూపులు శాంతికోసం ఆగదంతా కలియచూశాయి. మిగిలిపోయిన తమలపాకులూ, వక్కలూ, ఎండు ఖర్జూరాలూ, ఎండుకొబ్బరి చిప్పలూ ఉన్న స్టీలు పళ్ళేలూ, సగంవాడిన అరటి గెలా, ఒక మూల ఐరేణి కుండలూ, పసుపూ కుంకుమ బొట్లు పెట్టిన పెళ్ళి పీటలూ, స్టీలు బేసిన్లో మిగిలిపోయిన లడ్డూలూ, బంధువులు చదివించిన స్టీలు సామాగ్రి, మొదలైన పెళ్ళి సామాగ్రితో ఆ గదంతా నిండిపోయివుంది. విప్పి పడేసిన కొత్త చీరెలు చిందరవందరంగా పడేసివున్నాయి.

లడ్డూల వాసనా, క్రొత్త చీరల వాసనా, పన్నీరూ వాసనా.

ఆ గదిలో శాంతి ఎక్కడా కనిపించలేదు.

ఏదైనా ఉత్తరం వ్రాసి ఎక్కడికైనా వెళ్ళిపోయిందేమో!

ఇంతలో నా చూపు గది మధ్యకు లాగివున్న టేబిల్ మీద పడింది. అది అమ్మాయి చదువుకునే టేబిల్. దానిమీద ఎప్పుడూ ఉండే సరస్వతీ దేవి విగ్రహం, షిర్డీ సాయిబాబాఫోటోస్టాండ్ కిటికీలో పెట్టి ఉన్నాయి.

ఆ టేబిల్ మీదుగా నా కళ్ళకు సమాంతరంగా క్రొత్త వెండిమెట్లూ, క్రొత్త వెండి పట్టాలూ పెట్టిన అందమైన పారాణి పాదాలు కనిపించాయి. ఆ పాదాలను తాకులూ ఎర్రబోర్డరు తెల్ల తలంబ్రాల చీర అంచులూ ఆ పైన చీరమీద తలంబ్రాల తాలూకు పసుపు చిన్నెలూ కనిపించాయి. ఇంకా పైకి చూస్తే గుండెల మీదగ ముందుకు బడ్డ బారెడు జడా, అందులోంచి ముందుకు వ్రేలాడుతున్న మల్లెపూల చెండ్లూ - బుగ్గన కాటుక చుక్క - నుదుటున కల్యాణ తిలకం - ప్రక్కకి వాలిపోయిన మెడలోంచి ముందుకు వ్రేలాడుతున్న ఒక గంట క్రితమే కట్టబడ్డ క్రొత్త మంగళసూత్రాలూ...

నా తల్లి శాంతి సీలింగ్ ఫ్యాన్‌కి వ్రేలాడుతోంది.

అయిపోయిందిరా తమ్ముడు, అంతా అయిపోయింది..... మనమంతా అక్కడ వున్నాం, ఈ లోగల అది గదిలో తన పని తానే చేసుకుంది - ఇంత అఘాయిత్యం చేసుకుంటుందనుకోలేదు - వీడికి కూతురంటే ఎంత ప్రేమో! నా తల్లీ, నా తల్లీ, మా అమ్మా, మా అమ్మా అంటుంటాడు - వంటి మీద పసుపు బట్టలు వంటి మీదే ఉన్నాయి. ఇంతలోనే ఇంత ఘోరం తలపెట్టింది - అందరూ కల్సి తనకు కుష్టువాడ్ని కట్టబెట్టారని విరక్తి చెంది ప్రాణాలు తీసుకుంది. మనల్ని అందర్నీ అన్యాయం చేసిపోయింది.

నాంచారమ్మ పిన్నీ, భాగ్యం అక్కయ్యా, రాజ్యం, సుబ్బులు పిన్నీ నన్ను చుట్టుకుని విలపిస్తున్నారు.

ఇంతలో హనుమంతూ, రంగాచారీ, కృష్ణమూర్తి వాళ్ళు శాంతిని క్రిందకు దింపి, నేలమీద పడుకోబెట్టారు.

"అమ్మా శాంతీ!" అని అరుస్తూ రివ్వున వెళ్ళి ఆమె మృతదేహాల మీద పడి విలపించ సాగాను. నా భార్య సీతారత్నం స్పృహ తప్పి పడిపోయింది. ఒకవైపు ఆమెకు ఉపచారాలు చేస్తున్నారు.

నేను శాంతిమీద పడి అలా ఏడుస్తూ అప్రయత్నంగా ప్రక్కకి చూచాను.

ఫ్యాన్‌కి ఉరి వేసుకోటానికి ఉపయోగించిన సాధనం కనిపించింది.

అదేదో కాదు. నేను పెళ్ళి సరుకులతోపాటు తీసికొచ్చిన కొత్త అంగవస్త్రాల్లో రెండోది!

- *ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 11 నవంబరు 1990*

★